షణ్ముఖి
RNI : APTEL / 2023 / 89152
YEAR HAPPY WORK ANNIVERSARY...

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

సంపుటి : 2 సంచిక : 38 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 23 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 38 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 23 Decmbar 2024 PAGES : 8 PRICE : 5/-

# అటానమస్ డ్రోన్‌తో భద్రత పర్యవేక్షణ





- చంద్రబాబు సెక్యూరిటీ డ్యూటీలోకి అటానమస్ డ్రోన్
- సీఎం భద్రత భారీగా కుదింపు
- భారీ భద్రత, బందోబస్తు హడావుడికి దూరంగా సీఎం చంద్రబాబు
- సీఎం నివాసంలో అటానమస్ డ్రోన్‌తో పరిసర ప్రాంతాల్లో భద్రత పర్యవేక్షణ

**విజయవాడ**

ముఖ్యమంత్రి అంటేనే చుట్టూ వందలాది మందితో భారీ భద్రత. బయటకొస్తే చాలు అడుగడుగునా ఆంక్షలు, బారికేడ్లు, చెక్ పోస్టులు అబ్బో ఆ హడావుడే వేరులే. కానీ ప్రజల ముఖ్యమంత్రిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న చంద్రబాబు వీటన్నింటికీ దూరంగా ఉంటున్నారు. సాంకేతిక సాయాన్ని వినియోగించుకుంటూ తనకున్న భద్రతను గణనీయంగా తగ్గించుకున్నారు. ఎక్కువ మంది పోలీసులు, సిబ్బంది ఉంటే ఎక్కువ భద్రత ఇస్తున్నట్లు కాదని టెక్నాలజీ సాయంతో తక్కువ మందితోనే మెరుగైన భద్రతా ఏర్పాట్లు చేయవచ్చని నిరూపిస్తున్నారు. సీఎం నివాసంలో భద్రత పర్యవేక్షణను చేస్తున్న 'అటానమస్ డ్రోన్ల' ప్రత్యేకతలు ఏంటో చూసేద్దాం రండి.

నాడు 980 మందితో భారీ భద్రత: గతంలో జగన్ సీఎంగా ఉన్న సమయంలో హంగూ ఆర్భాటాలతో నానా హడావుడి చేశారు. మితిమీరిన భద్రతతో ప్రజలను అనేక విధాల ఇబ్బంది పెట్టారు. తాడేపల్లి ఇంటి చుట్టూ చెక్ పోస్టులు, అడుగడుగునా బారికేడ్లు, ఆర్మడ్ గాడ్స్, పబ్లిక్ రోడ్లలో జనాలు తిరగకుండా ఆంక్షలతో సీఎం నివాస చుట్టుపక్కల ప్రాంతాలను పూర్తి నిషేధిత ప్రాంతంగా చేశారు. ప్రత్యేక ఆపరేషన్లకు ఉపయోగించే ఆక్టోపస్ టీం ఫోర్స్‌ను తన ఇంటి చుట్టుపక్కల 24 గంటలు సెక్యూరిటీలో ఉపయోగించారు. ఇంటికి నలుమూలలా నలుగురు స్నైపర్స్‌ను కూడా జగన్ భద్రత కోసం మోహరించారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనాలతో మొబైల్ క్యూఆర్టీలు ఏర్పాటు చేసి దేశంలో ఏ ఇతర సీఎంకు లేని స్థాయిలో నాడు సెక్యూరిటీ కోసం కోట్లు ఖర్చు చేశారు. ఏడాదికి 90 కోట్లు ఖర్చు చేసి ప్రత్యేక బలగాలతో 980 మందితో భారీ భద్రత ఏర్పాటు చేసుకున్నారు. కానీ 4వసారి సీఎంగా ఉన్న చంద్రబాబు మాత్రం వీటన్నింటికీ తాను దూరమంటూ నిరూపించుకుంటున్నారు. తాను ప్రజలకు మాత్రం సేవకుడినంటూ చూపిస్తున్నారు. జగన్?కు ఉన్న భద్రతా సిబ్బందిలో 5 వంతుతోనే భద్రత కల్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రికి 980మందిగా ఉన్న భద్రత నేడు కేవలం 121మందికి చేరింది. సీఎంగా జగన్ కాన్వాయిలో 17 వాహనాలు ఉండగా, జడ్ ప్లస్ భద్రత ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వాహన శ్రేణి 11వాహనాలకే పరిమితమైంది. ఇతర - మిగతా3లో

## సంధ్యా థియేటర్ ఘటనలో ఇంటెలిజెన్స్ వైఫల్యం

- తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు
- ఇంటెలిజెన్స్ వ్యవస్థ ముందుగానే అంచనాలు వేయడం బాధ్యత
- ఫిల్మ్ స్టార్స్ కూడా పరిస్థితిని అంచనా వేయగలగాలి
- ప్రభుత్వం కూడా ఆలోచించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి



**అమరావతి**

తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు సంధ్యా థియేటర్ ఘటన. అల్లు అర్జున్ అరెస్టుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన ఏపీలో మీడియాతో మాట్లాడారు. పుష్ప-2 సినిమా ప్రదర్శన సందర్భంగా అక్కడికి హీరో అల్లు అర్జున్ రాకతో జరిగిన తొక్కిసలాటలో ఇంటెలిజెన్స్ వైఫల్యం కనిపిస్తోందని అన్నారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ముందుగానే అంచనాలు వేయడం బాధ్యత అని గుర్తు చేశారు. ఫిల్మ్ స్టార్స్ కూడా పరిస్థితిని అంచనా వేయగలగాలని , ప్రభుత్వం కూడా ఆలోచించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఆ సమయంలో అల్లు - మిగతా3లో

## ఈసీ కొత్త రూల్స్!

- ఇకపై పోలింగ్ సీసీటీవీ ఫుటేజ్ చెక్ చేసేందుకు నో ఛాన్స్
- సీసీ కెమెరాల వీడియోలు, వెబ్‌కాస్టింగ్ బహిరంగపరచకుండా చర్యలు
- అభ్యర్థులపై వీడియో రికార్డింగుల వెల్లడి నిషేధం
- నిబంధనల్లో ఈసీ మార్పులు



## ఆ హామీని నిలబెట్టుకుంటాం..

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- గత ఐదేళ్లలో ఒక్క కొత్త బస్సులు కూడా కొనలేదు.
- కొత్త బస్సులు ప్రవేశపెట్టడానికి సీఎం చంద్రబాబు నాయుడు అని చర్యలు తీసుకుంటున్నారు

**విశాఖపట్నం:**

జగన్ ప్రభుత్వ హయంలో ఏపీఎస్‌ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యం అయిందని... ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ప్రక్షాళన చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లిరాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ద్వారకా నగర్ బస్ స్టేషన్‌లో ఆదివారం నూతన బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, - మిగతా3లో



## మార్మోగిన అయ్యప్ప నామం

- అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు 'తంకా అంకి'
- మండల పూజకు ముందు జరిగే యాత్ర విశేషాలివే!
- 'బుధవారం నాటికి అయ్యప్ప సన్నిధానానికి చేరిక'
- డిసెంబరు 25నాటికి అయ్యప్ప సన్నిధానానికి చేరిక

## అల్లుఅర్జున్ ఇంటిపై రాళ్ల దాడి



- తీవ్ర ఉద్రిక్తత - భారీగా పోలీసుల మోహరింపు
- అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు విసిరిన ఓయూ జేఏసీ నాయకులు
- హైదరాబాద్ అల్లు అర్జున్ ఇంటి వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్**

ఓయూ జేఏసీ విద్యార్థి సంఘాల ఆందోళనతో జూబ్లీహిల్స్ లోని అల్లు అర్జున్ ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రేవతి మరణానికి అల్లు అర్జునే కారణమంటూ - మిగతా3లో

## నా బలం ప్రజలు, కార్యకర్తలే



- చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు ధైర్యం చెప్పింది వారే: నారా భువనేశ్వరి..
- తనకు ధైర్యం ఇచ్చి పోరాడింది ప్రజలు, కార్యకర్తలే
- వైసీపీ పాలనలో ప్రజలు, మహిళలు తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు
- ఆ స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందేందుకు రాష్ట్ర ప్రజలంతా కలిసికట్టుగా పోరాడి కూటమిని గెలిపించుకున్నారు

**చిత్తూరు:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి నాలుగు రోజులుగా చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కాగా, ఇవాళ (ఆదివారం) చివరి రోజు పర్యటనలో భాగంగా కుప్పం నియోజకవర్గంలో భువనేశ్వరి పర్యటించారు. ఆదివారం ఉదయం కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల గెస్ట్ హౌస్ వద్దకు చేరుకున్న భువనేశ్వరి స్థానిక ప్రజలను కలిశారు. వారితో మాట్లాడి సమస్యల - మిగతా3లో

# నా బలం ప్రజలు, కార్యకర్తలే

-మొదటిపేజీ తరువాయి

గురించి అడిగి తెలుసుకున్నారు. వినతిపత్రాలు స్వీకరించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు శాంతిపురం మండలం చెల్దిగానిపల్లి గ్రామానికి వెళ్లి స్థానిక మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వారితో స్థానిక విషయాలు సహా మహిళల సమస్యలపై చర్చించారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు వి.కోటకు చేరుకుని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డితో కలిసి సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను భువనేశ్వరి ప్రారంభించారు.

**నా బలం వారే..**

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన భువనేశ్వరి గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దారుణాలపై మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో చంద్రబాబు అరెస్టు ఘటనను భువనేశ్వరి గుర్తు చేసుకున్నారు. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును అరెస్టు చేసి రాజమండ్రి జైల్లో పెట్టారని, ఆ సమయంలో తనకు ధైర్యం ఇచ్చి పోరాడింది ప్రజలు, కార్యకర్తలేనని ఆమె చెప్పారు. వైసీపీ పాలనలో ప్రజలు, మహిళలు తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందేందుకు రాష్ట్ర ప్రజలంతా కలిసికట్టుగా పోరాడి కూటమిని గెలిపించుకున్నారని భువనేశ్వరి చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుస్థిర పాలన సాగుతోందని, మహిళలపై చిన్న అఘాయిత్యం జరిగినా ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ బాధితులను ఆదుకుంటోందని చెప్పారు. అమరావతి పనులు సైతం పరుగులు పెడుతున్నాయని, రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని భువనేశ్వరి చెప్పుకొచ్చారు.

**ఆదాయం మొత్తం పాయే..**

పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ.. "ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని అన్ని రకాలుగా ఆపేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కోసం ఇచ్చిన అనుమతులను వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఆ పనులకు మోక్షం కలుగుతోంది. కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న వి.కోట అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం అనేక రకాల ఆటంకాలు సృష్టించింది. బైపాస్ రోడ్డు నిర్మాణం విషయంలో జగన్ సర్కార్ అనుసరించిన విధానాలతో ప్రజలు, రైతులకు తీరని నష్టం వాటిల్లింది. వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ఆదాయం మొత్తం కర్ణాటకకు వెళ్లిపోయిందని"

# పేర్ని నాని కేసులో కదలిక

**విజయవాడ :** మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయం ఘటనలో.. పోలీసు, పౌరసరఫరాలశాఖల్లో కొంత కదలిక వచ్చింది. గోదాము నిర్వాహకులైన మాజీమంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన వ్యక్తులు విదేశాలకు పారిపోకుండా.. పోలీసులు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. అసలు వాస్తవంగా గోడౌన్‌లో మాయమైన బియ్యమెంతో తేల్చే ప్రక్రియను పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రారంభించారు. కేసులో నిందితులు బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా ఆ పిటిషన్ విచారణకు వచ్చి 19వ తేదీకి వాయిదా పడింది. వైసీపీకు చెందిన మాజీమంత్రి కుటుంబ సభ్యులపై కేసు విషయంలో ఇంత జరుగుతున్నా.. కూటమి నేతల మౌనం విస్తుగొలిపేలా ఉంది. ఈ విషయంలో కొందరు మంత్రులు, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజాప్రతినిధులకు నిజంగా సత్కారం చేయాల్సిందేననే విమర్శలు అధికార పార్టీల కార్యకర్తల్లో కొనసాగుతున్నాయి.మాయమైన బియ్యానికి సంబంధించి జరిమానాతో కలిపి డబ్బు కట్టమని అధికారులు నోటీసు ఇవ్వడంతో.. పేర్ని నాని కుటుంబసభ్యులు తొలి విడతగా ఈ నెల 13న రూ.కోటి మొత్తానికి మూడు డీడీలు సమర్పించారు. సోమవారం మరో రూ.70 లక్షలకు డీడీలు ఇచ్చారు. మొత్తంగా రెండు విడతల్లో రూ.1.70 కోట్ల డీడీలు అధికారులకు అందించారు. అంటే జరిమానాతో కలిపి సొమ్ము చెల్లించామని చెప్పి కేసు నుంచి తేలిగ్గా బయటపడే అవకాశాన్ని అధికారులే కల్పించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బెయిల్ తెచ్చుకుని బయటపడేందుకు శక్తిమేర సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారుల ఉదాసీన వైఖరే దీనంతటికీ కారణమంటున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి కుటుంబానికి సంబంధించిన గోడౌన్ వ్యవహారం కావడం, కృష్ణా జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కూడా ఆయనకే అనుకూలమనే సంకేతాలు ఉండడంతో.. జిల్లాస్థాయి అధికారులు తమకెందుకొచ్చిన గొడవని ఎవరికి వారే కేసు తీవ్రత తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.టీడీపీ,జనసేన నేతలపై తీవ్ర విమర్శలతో విరుచుకుపడే పేర్ని నాని కుటుంబానికి సంబంధించిన గోడౌన్‌లో 3,708 బస్తాల రేషన్ బియ్యం మాయమైనా..



పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ ఛాయలకే పోలేదు. పర్యటనలకు వెళ్తే చాలు, సూపర్‌బజార్లు, రైస్ మిల్లులు, పోర్టుల్లో గోదాములను తనిఖీలకు ఉపక్రమించే ఆయన.. ఈ గోడౌన్ జోలికి వెళ్లకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతుంది. ప్రెస్‌మీట్లు పెట్టి వైసీపీ నేతలపై విమర్శలు చేసే హోంమంత్రి అనిత.. పేదల బియ్యాన్ని మాయం చేసినందుకు అదే వైసీపీకి చెందిన పేర్ని నాని కుటుంబ సభ్యులపై కేసు నమోదైనా, ఇప్పటికీ అరెస్టు చేయకపోయినా .. నోరు మెదపక పోవడానికి కారణమేంటని కూటమి కార్యకర్తలు ప్రశ్నలు సంధిస్తున్నారు.తమ గోదాములో బియ్యం మాయమయ్యాయని పేర్ని నాని కుటుంబ సభ్యులు లేఖ ఇచ్చి 20 రోజులు అవుతున్నా.. వాస్తవంగా మాయమైన బియ్యం పరిమాణం ఎంతనేది ఇప్పటికి స్పష్టమైన లెక్కలు లేవు. తాజాగా సోమవారం అధికారులు గోదాము వద్దకు చేరుకోగా.. సంస్థ సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో న్యాయవాది సమక్షంలో పంచనామా చేసి.. తాళాలు పగలగొట్టి లోనికి వెళ్లారు. బియ్యం నిల్వల వివరాలు సేకరిస్తున్నారు. అక్కడున్న వేబ్రిడ్జి పనిచేయడం లేదంటూ.. బియ్యాన్ని మరోచోట తూకం పెట్టించి తరలించే ప్రక్రియ ప్రారంభించారు.మాయమైన బియ్యం లెక్కలు.. అంచనాకంటే ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. తూకంలో తేడా కారణంగా తొలుత 3,200 బస్తాల బియ్యం తగ్గాయని తొలుత పేర్ని కుటుంబ సభ్యులు అధికారులకు లేఖ రాశారు. అధికారులు అక్కడకు వెళ్లి ఖాతా పుస్తకాలు పరిశీలించగా.. 3,708 బస్తాలు తగ్గాయని ప్రాథమికంగా అంచనా వేశారు. బియ్యాన్ని తరలించే సందర్భంగా పరిశీలించగా.. ఇప్పటికే చెప్పిన పరిమాణం కంటే మరింత భారీగా మాయమైనట్లు బయటపడుతోంది. అసలు గోదాము నుంచి రేషన్ బియ్యం ఎప్పుడు మాయమయ్యాయనే వివరాలు ఇప్పటికీ తేల్చలేదు.చౌక బియ్యం మాయమైన వ్యవహారంలో ఈ నెల 10న గోదాము యజమాని పేర్ని జయసుధ, మేనేజర్ మానస్ తేజపై పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. దీనిపై 13న జయసుధ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. గురువారానికి వాయిదా వేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పీపీని నియమించాల్సి ఉందని న్యాయవాదులు వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన ఏపీపీనే ఇప్పటికీ కొనసాగించడం గమనార్హం. ఈ కేసులో ప్రధాన నిందితురాలు జయసుధ విదేశాలకు వెళ్లకుండా లుక్ ఔట్ నోటీసులు జారీ చేసినట్లు ఎస్పీ గంగాధరరావు పేర్కొన్నారు.బియ్యం మాయమైన ఘటనలో కేసు నమోదైన నాటి నుంచి పేర్ని నాని అజ్ఞాతంలోకి వెళ్లారు. జిల్లా వైసీపీ అధ్యక్షునిగా ఉన్న నాని, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయన తనయుడు కిట్టు పార్టీ కలెక్టరేట్ వద్ద చేపట్టిన పోరుబాట కార్యక్రమంలోనూ కనిపించలేదు. మాయమైన బియ్యానికి జరిమానాగా రూ. 1.70 కోట్లు చెల్లించిన నేపథ్యంలో.. తాజాగా నాని సోమవారం మధ్యాహ్నం తన నివాసంలో ప్రత్యక్షమవ్వడం చర్చనీయాంశంగా మారింది. పెనాల్టీ కొట్టేయడంతో ఇక కేసు నుంచి బయట పడవచ్చన్న ధీమాతోనే ఆయన బయటకు వచ్చారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# భీమిలీలో నేతల సిగపట్లు

**విశాఖపట్టణం :** వైసీపీని వలసలు వేధిస్తున్నాయి. మొన్నటి వరకు పార్టీకి బలంగా ఉన్న నేతలు కూడా చెట్టుకొకరు, పుట్టకొకరు ఐపోతున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు ఇప్పుడు వర్గపోరు కూడా తోడైంది. ఇది చాలదన్నట్టు ఖాళీ అయిన నియోజకవర్గంలో ఇన్‌చార్జ్ పోస్ట్ కోసం ఆశావహులు కన్నేస్తున్నారు. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ అయిన భీమిలిపై ఇప్పుడు ఇద్దరు నేతల కన్ను పడింది.వైసీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఇంతవరకు పలానా నియోజకవర్గం ఫిక్స్ అంటూ ఏమీ లేదు. దీంతో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. నియోజకవర్గం వెతుక్కోవాల్సిన దుస్థితి వస్తోంది. 2014-అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో అనకాపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మొన్నటి ఎన్నికల్లో గాజువాక నుంచి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయనకు ఇప్పుడు ఏ నియోజకర్గంలో యాక్టివ్‌గా ఉండాలో తోచడం లేదు. పొలిటికల్ చౌరస్తాలో నిలబడి దిక్కులు చేస్తున్నారు. ఇంతలో ఆయనకు ఊహించని లక్కీ చాన్స్ ఎదురైంది. మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ పార్టీ నుంచి వెళ్లిపోవడంతో భీమిలి వైసీపీ సీటు ఖాళీ అయ్యింది.. దీంతో అమర్‌నాథ్ కన్ను భీమిలీపై పడిందని వైసీపీ వర్గాల ఇన్నర్ టాక్. అంతేకాదు భీమిలి ప్రజలతో టచ్‌లోకి వెళ్లడం, జిల్లా రాజకీయాలను ఫుల్‌గా స్టడీ చేయడం కూడా మొదలుపెట్టారంట అమర్‌నాథ్..గుడివాడ అమర్‌నాథ్ కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. భీమిలీలో కాపుల ఓటు బ్యాంక్‌కు కొదవే లేదు. ఇది తనకు బాగా కలిసొస్తుందని అమర్‌నాథ్ లెక్కలు వేసుకుంటున్నారు. పార్టీలను పక్కన పెడితే.. భీమిలి నుంచి కొంతకాలంగా కాపు లీడర్లే గెలుస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న గంటా శ్రీనివాసరావు కావచ్చు.. అంతకుముందు ఎమ్మెల్యేగా గెలిచిన అవంతి శ్రీనివాస్, అంతకుముందు కర్రి సీతారామ్.. ఇలా చెప్పుకుంటే పోతే.. కాపుల నాయకుల పేర్లే కనిపిస్తున్నాయి.



యాదవ సామాజికవర్గం, క్షత్రియుల ప్రాబల్యం ఉన్నప్పటికీ కాపులనే ఫాలో అవుతారని పొలిటీషియన్స్ లెక్క. దీనిని పసిగట్టిన అమర్‌నాథ్.. భీమిలి సీటుపై కర్చీఫ్ వేసుకోవాలని చూస్తున్నారట..అంతేగాక భీమిలి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలు తన తాత అప్పన్న, తండ్రి గుర్నాథరావు ప్రాతినిధ్యం వహించిన సింహాచలం, మధురవాడ ప్రాంతాలు కూడా కలిసి ఉన్నాయి. ఇది కూడా తనకు ప్లస్ పాయింట్ అవుతుందనే ఈక్వేషన్స్‌తో అమర్‌నాథ్ భీమిలి వైపు వెళు న్నారని లోకల్ టాక్.. అంతేకాదు ఆ టికెట్ దక్కితే తన పొలిటికల్ ఫ్యూచర్‌కు ఢోకా ఉండదనే భావనలో ఆయన ఉన్నారనే తెలుస్తోంది.ఐతే భీమిలి భీముడిని తానే అంటూ ఊహాల్లో విహరిస్తున్న అమర్‌నాథ్‌కు పిడుగులాంటి వార్త చెవిన పడిందట. అదే భీమిలి స్థానంపై పొరుగు జిల్లా నేత కూడా కన్నేశారనేది.. ఆయన వస్తే తన సీటుకు ఎసరు వస్తుందని అమర్‌నాథ్ డైలామాలో పడిపోయారని విశాఖ లోకల్ పాలిటిక్స్‌లో వినిపిస్తున్న గాసిప్. విజయనగరం జిల్లాకు చెందిన మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను భీమిలి సీటుపై గురిపెట్టారట. ఈయన మరెవరోకాదు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు స్వయాన మేనల్లుడు. బొత్సకు రాజకీయాల్లో చేదోడు వాదోడుగా ఉంటూనే, జిల్లా రాజకీయాల్ని శాసిస్తుంటారని పేరుంది. వైసీపీ అధినేత జగన్‌కు కూడా కాస్త సన్నిహితంగా కనిపిస్తారు. ఇక ఈ విషయం తెలిసినప్పటి నుంచి అమర్‌నాథ్‌కు కంటిమీద కునుకు ఉండడం లేదట.విజయనగరం జిల్లాకు చెందిన చిన్న శ్రీను, విశాఖకు ఎందుకు వస్తున్నారనే అనుమానాలు కూడా లేకపోలేదు. అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించాలని చిన్న శ్రీనుకు ఎప్పటి నుంచో కోరిక ఉంది. టికెట్ వచ్చినట్టే వచ్చి చేజారిపోతుంది. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో చాన్స్ మిస్ చేసుకోవద్దనే ఆలోచనలో ఉన్నారట చిన్న శ్రీను. విజయగనరం జిల్లాలో ఇప్పటికే బొత్స కుటుంబీకులు చాలా స్థానాల్ని గుప్పిట్లో పెట్టుకున్నారు. ఎక్కడా ఖాళీ లేక చిన్న శ్రీను చూపు భీమిలిపై పడిందని టాక్ నడుస్తోంది.క్యాస్ట్ ఈక్వేషన్స్‌పై గుడివాడ అమర్ ఆశలు పెట్టుకున్నట్లే.. చిన్న శ్రీను కూడా సేమ్ లెక్కలు వేసుకున్నారు. పైగా నియోజకవర్గంలోని మూడు మండలాల్లో చిన్న శ్రీను బంధుగణం ఉంది. దీంతో భీమిలి బెటర్ ఆప్షన్‌గా ఫీలవుతున్నారట చిన్న శ్రీను.మొత్తానికి అవంతి శ్రీనివాస్ వదిలి వెళ్లిన భీమిలి స్థానాన్ని ఎవరికి కేటాయించాలని వైసీపీ అధినేత జగన్ డైలామాలో ఉన్నారని పార్టీలో ఇన్నర్ టాక్. గుడివాడ అమర్, చిన్నశ్రీను ఇద్దరూ మాజీ సీఎం జగన్‌కు చాలా క్లోజ్‌గా ఉంటారు. మరి ఈ ఇద్దరిలో ఎవరిని వద్దన్నా.. అసంతృప్త స్వరాలు వినిపించేలా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో హైకమాండ్ నిర్ణయం ఎలా ఉంటుందోనన్నది ఉత్కంఠగా మారింది.

## అల్లుఅర్జున్ ఇంటిపై రాళ్ల దాడి

-మొదటిపేజీ తరువాయి

పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మృతురాలు రేవతి కుటుంబానికి వెంటనే రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొందరు నిరసనకారులు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి నినాదాలు చేసుకుంటూ దూసుకెళ్లేందుకు యత్నించారు. రాళ్లు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు, గార్డెన్‌లోని మొక్కలు ధ్వంసమయ్యాయి. విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. నివాసం దగ్గర అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీగా మోహరించారు. ఘటన జరిగిన సమయంలో నటుడు అల్లు అర్జున్ తన నివాసంలో లేరని సమాచారం. విషయం తెలుసుకున్న ఆయన మామ, కాంగ్రెస్? నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి అక్కడికి చేరుకుని ఈ ఘటనపై ఆరా తీస్తున్నారు. జరిగిన రాళ్ల దాడిపై సెక్యూరిటీ సిబ్బంది జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సంయమనం పాటించాలి : అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిపై ఆయన తండ్రి అల్లు అరవింద్? స్పందించారు. "మా ఇంటి ముందు జరిగిన ఘటన మీరంతా చూశారు. ఇలా ఎవరికీ జరగకూడదు. ఇలాంటి పరిస్థితుల్లో అందరూ సమయనం పాటించాలి అదే మంచిది. తొందరపడి చర్యలకు దిగొద్దు" అని అల్లు అరవింద్ తెలిపారు. ఈ రాళ్ల దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారా? అని మీడియా ప్రశ్నకు అల్లు అరవింద్ స్పందించకుండా వెళ్లిపోయారు.

## ఆ ఘటనకు అల్లు అర్జున్ కారణం కాదు: పురందేశ్వరి

సంధ్య థియేటర్ తొక్కిసలాటపై నిన్న అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రసంగం

అల్లు అర్జున్ దే తప్పంటూ తీవ్ర వ్యాఖ్యలు

ప్రెస్ మీట్ పెట్టి వివరణ ఇచ్చిన అల్లు అర్జున్

అల్లు అర్జున్ కు మద్దతుగా పురందేశ్వరి వ్యాఖ్యలు

ఆ ఘటన అల్లు అర్జున్ ప్రేరేపించింది కాదని స్పష్టీకరణ



సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు అల్లు అర్జున్ కారణం కాదని ఏపీ బీజేపీ చీఫ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అభిప్రాయపడ్డారు. ఆ సినిమాలో హీరో కాబట్టి అల్లు అర్జున్ పుష్ప-2 ప్రదర్శిస్తున్న థియేటర్ వద్దకు వచ్చాడని అన్నారు. ఆ తొక్కిసలాట ఘటన ఆయన ప్రేరేపించింది కాదని పేర్కొన్నారు. ఈ కేసులో అల్లు అర్జున్ ఏ11 గా ఉన్నారని, అలాంటప్పుడు మిగతా వాళ్లను కాకుండా అల్లు అర్జున్ ను అరెస్ట్ చేయడం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు. తొక్కిసలాట ఘటనపై నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వాడీవేడి ప్రసంగం చేయడం తెలిసిందే. ప్రధానంగా అల్లు అర్జున్ పై ఆయన నిప్పులు చెరిగారు. ఈ ఘటనలో అల్లు అర్జున్ తప్పు ఉందంటూ ఆరోపణలు చేశారు. రేవంత్ వ్యాఖ్యలకు స్పందనగా అల్లు అర్జున్ రాత్రి ప్రెస్ మీట్ పెట్టి వివరణ ఇచ్చారు. తనపై లేనిపోని అభాండాలు వేస్తున్నారని, చేయని తప్పులు తనకు ఆపాదిస్తున్నారని అల్లు అర్జున్ వాపోయారు. ఆయన తండ్రి అల్లు అరవింద్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని కొత్త మామిడిపాలెం రోడ్డులో ఈ రోజు కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బాలికల వసతి గృహం భూమి పూజ కార్యక్రమంలో పురందేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను మీడియా ప్రతినిధులు అల్లు అర్జున్ ఇష్యూపై స్పందన కోరగా, ఆమె తాజా వ్యాఖ్యలు చేశారు.

## అటానమస్ డ్రోన్‌తో భద్రత పర్యవేక్షణ

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాల్లో పర్యటనలకు వెళ్లినప్పుడు కూడా అవసరమైన కనీస సిబ్బందితో ఆయన భద్రత కొనసాగుతుంది.

**అటానమస్ డ్రోన్‌తో భద్రత పర్యవేక్షణ**

ఎక్కువ మంది పోలీసులు, సిబ్బంది ఉంటే ఎక్కువ భద్రత ఇస్తున్నట్లు కాదని టెక్నాలజీ సాయంతో తక్కువ మందితో ప్రణాళికతో వ్యవహరించినా మెరుగైన భద్రతా ఏర్పాట్లు చేయవచ్చని సీఎం నిర్దేశించారు. ఈ మేరకు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో అత్యాధునిక డ్రోన్‌ను ఏర్పాటు చేశారు. సీఎం నివాసంలో 'అటానమస్ డ్రోన్ల' సాయంతో పరిసరి ప్రాంతాల భద్రత పర్యవేక్షణను చేపట్టారు. ఆ డ్రోన్ తనకు ప్రోగ్రాం ఇచ్చిన విధంగా ప్రతి రెండు గంటలకు ఒక సారి పరిసర ప్రాంతాల్లో ఎగిరి వీడియో షూట్ చేస్తుంది.

సాధారణ పరిస్థితుల కంటే భిన్నంగా మూమెంట్ కనిపించినా, కొత్త వస్తువులు, అనుమానాస్పద వస్తువులు కనిపించినా మానిటరింగ్ టీంకు మెసేజ్ పంపుతుంది. సీఎం నివాసంలో పెట్టిన ఈ డ్రోన్ అటనామస్ విధానంలో ఆటోపైలెట్‌గా ఆయా ప్రాంతాల్లో ఎగురుతుంది. మళ్లీ వచ్చి నిర్దేశించిన డక్‌పై ల్యాండ్ అయ్యి తానే ఛార్జింగ్ పెట్టుకుంటుంది. ఈ డ్రోన్ పంపే డాటాను విశ్లేషించడం ద్వారా ఇంటి పరిసర ప్రాంతాల్లో సెక్యూరిటీని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**బందోబస్తు హడావుడి తగ్గించాలి:**

అటానమస్ డ్రోన్ ద్వారా తక్కువ సమయం, సిబ్బందితో ఎక్కువ పని జరుగుతుంది. నాణ్యతా పెరుగుతుంది. ప్రైవేటు కార్యక్రమాలకు సీఎం వెళ్తున్న సందర్భంలో అక్కడి వారికి ఇబ్బంది లేకుండా పరిమిత సిబ్బందిని పెట్టాలని కూడా అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇలాంటి ప్రాంతాల్లో బందోబస్తు హడావుడి తగ్గించాలని సీఎం గట్టిగా సూచించారు. ఇలా ప్రతి విషయంలో ముఖ్యమంత్రి నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండడంతో చాలా వరకు సీఎం పర్యటన సందర్భంగా ఆంక్షల సమస్య తలెత్తడం లేదు.

## సంధ్యా థియేటర్ ఘటనలో ఇంటెలిజెన్స్ వైఫల్యం

-మొదటిపేజీ తరువాయి

అర్జున్ అక్కడికి వెళ్లాల్సింది కాదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు హాని కలుగకుండా చూడాలని, బాధిత కుటుంబానికి అండగా నిలబడాలని వెల్లడించారు . తప్పులను ఎత్తిచూపడం కంటే బాధిత కుటుంబానికి అండగా నిలబడాలని అన్నారు.ఏపీలో ఎన్నో అందమైన షూటింగ్ స్పాట్స్ ఉన్నాయని, సినీ ఇండస్ట్రీ ఏపీకి వస్తే బాగుంటుందని పవన్‌కల్యాణ్ కూడా చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ సినీ పరిశ్రమ ఏపీకి వస్తే స్వాగతిస్తామన్నారు. గతంలో కంటే ఎక్కువగా హైదరాబాద్ చాలా రద్దీగా మారిందదని, మరో చోట పరిశ్రమ అభివృద్ధి చెందాలని అది ఏపీ అయితే మరి బాగుంటదని అన్నారు. సినీ పరిశ్రమ ఏపీకి వస్తే ఉపాధి పెరుగుతుందని, కళాకారులకు చేతి నిండా పనిదొరుకుతుందని పేర్కొన్నారు.

## ఆ హామీని నిలబెట్టుకుంటాం..

-మొదటిపేజీ తరువాయి

టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో ఒక్క కొత్త బస్సులు కూడా కొనలేదని..కొత్త బస్సులు ప్రవేశపెట్టడానికి సీఎం చంద్రబాబు నాయుడు అని చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. త్వరలోనే డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని పోస్టులు కూడా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం తప్ప వైసీపీ ప్రభుత్వం ఎటువంటి కార్యక్రమం చేపట్టలేదని మండిపడ్డారు. ఎక్కువ మంది కార్మికులకు ఏపీఎస్‌ఆర్టీసీయే ఉపాధి కల్పిస్తుందని వివరించారు. జగన్ సర్కార్ ప్రభుత్వ ఉద్యోగస్తులను ఒక పురుగుల్లా చూసిందని.. వారి జీవితాలతో ఆడుకుందని విమర్శించారు.


షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

## ప్రకాశం

# క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి
డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, డిశంబర్ 22)

రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ గ్రామ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. సింగరాయకొండ మండలం పాకలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుచున్న 68వ రాష్ట్రస్థాయి అండర్ 17,18,19 బాల బాలికల క్యారమ్స్ పోటీలను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువు తోపాటు క్రీడల్లో పాల్గొన్నపుడే వారి మనో వికాసం, మానసిక ధైర్యం, శారీరక దృఢత్వం పెంపొందింపబడుతుందన్నారు. ఇలాంటి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణ వలన వివిధ ప్రాంతాలనుండి వచ్చిన క్రీడాకారులు ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సాంప్రదాయాలు, సంస్కృతిని ప్రత్యక్షంగా చూసి తెలుసుకోవడంతో పాటు స్నేహ సంబంధాలు ఏర్పడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ గ్రామ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అమరావతి రాజధానిలో గొప్ప క్రీడా స్టేడియంలను నిర్మించబోతున్నట్లు మంత్రి తెలిపారు. 2014-19 సంవత్సరాల కాలంలో కొండపి, జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇండోర్ స్టేడియంల నిర్మాణాలు చేపడితే గత ప్రభుత్వ హయాంలో ఆ నిర్మాణాలు ఆగిపోయాయని, వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. సాంఘీక సంక్షేమ శాఖ లో ఏడు సంవత్సరాల నుండి ఆగిపోయిన స్పోర్ట్స్ మీట్ ను మరలా ప్రారంభిస్తామని దానికి కోటి రూపాయల నిధులను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా చాలా పాఠశాలల్లో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియంల నిర్మాణాలను

4

# జమిలి ఎన్నికల పై అభిప్రాయాలు తీసుకోవాలి

రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు,
ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)

జమిలి ఎన్నికలపై అన్ని పార్టీలతో పాటు ప్రజల అభిప్రాయాలు కూడా తీసుకోవాలని లక్ష్యంతోనే బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయడం జరిగిందని రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఒక కార్యక్రమంలో పాల్గొనటానికి ఆదివారం ఒంగోలు వచ్చిన ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెట్టడం జరిగిందని, దీనిపై అందరి అభిప్రాయాలు తీసుకొని ఏకాభిప్రాయ సాధన కోసం జెపీసి వేయడం జరిగిందన్నారు. హైదరాబాదులో అల్లు అర్జున్ సంఘటనపై ఆమె స్పందిస్తూ, ఈ విషయమై తన అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలో ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. జరిగిన ఘటనలో అల్లు అర్జున్ ఉద్దేశపూర్వకంగా ఏమీ చేయలేదని, పైగా ఈ కేసులో ఆయన ఏ11గా ఉన్నారని మిగతా వారిని కాకుండా ఆయనను మాత్రమే అరెస్టు చేయడం మంచిది కాదన్నారు.





# మేమింతే..!

- నాడు ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు
- నేడు ఉచిత ఇసుక విధానానికి తూట్లు
- ఇసుక అక్రమ రవాణా పై అప్పుడు అలా...ఇప్పుడు ఇలా
- అధికార అండదండలతో యథేచ్ఛగా ఇసుక తరలింపు
- వేంపాడులో పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఇసుక అక్రమ రవాణా తవ్వకాలను అడ్డుకున్న వారిని బెదిరిస్తున్న పొన్నలూరు పోలీసులు

4

# వరుస భూకంపాల పై ప్రకాశం కలెక్టర్‌ను నివేదిక కోరిన మంత్రులు గొట్టిపాటి, డోలా

(షణ్ముఖ వెలుగు, అమరావతి, డిశంబర్ 22)

ప్రకాశం జిల్లాలో వరుస భూ ప్రకంపనలు రావడంపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామిలు దృష్టి సారించారు. గత రెండు రోజులుగా జిల్లాలోని దర్శి నియోజకవర్గంలో వరుసగా భూ ప్రకంపనలు రావడపై ప్రకాశం కలెక్టర్ తో ఇరువురు మంత్రులు మాట్లాడారు. తరచుగా ఆ ప్రాంతంలో భూ ప్రకంపనలు ఎందుకు వస్తున్నాయో తెలుసుకోవాలని సూచించారు. అంతేగాక ఈ విషయంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ వారితో మాట్లాడి తెలుసుకోవాలని కలెక్టర్‌ని ఆదేశించారు. భూ ప్రకంపనలు ఎందుకు వస్తున్నాయి, ఎక్కడ భూకంప కేంద్రం నమోదవుతుంది లాంటి వివరాలను తెలుసుకునేందుకు ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తలతో కూడా చర్చించాలని మంత్రులు సూచించారు. ప్రకాశం జిల్లాలో వచ్చిన వరుస భూకంపాలపై సమగ్ర నివేదికను ఇవ్వాలని కలెక్టర్‌ను మంత్రుల గొట్టిపాటి రవి కుమార్, డీబీవీ స్వామిలు కోరారు. భూకంపంపై ప్రజలు ధైర్యంగా ఉండాలని ఎవరూ భయాందోళనకు గురికావద్దని పిలుపునిచ్చారు.

# స్మార్ట్ కిడ్స్‌లో అట్టహాసంగా మ్యాథ్స్ ఫెయిర్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిశంబర్ 22)

పొదిలి పట్టణంలోని స్మార్ట్ కిడ్స్ స్కూల్ నందు ఆదివారం ఉదయం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని మ్యాథ్స్ ఫెయిర్ నిర్వహించారు. తొలుత పాఠశాల కరస్పాండెంట్ రాజారెడ్డి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రామానుజన్ చరిత్రను విద్యార్థినీ, విద్యార్థులకు వివరించారు. అనంతరం మ్యాథ్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు తయారుచేసిన పలు ప్రాజెక్టులు అందరిని ఆకర్షించాయి. చిన్నారులు వారు చేసిన ప్రాజెక్టును ప్రతి ఒక్కరికీ విపులంగా వివరించారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థుల్లోని సృజనాత్మకతను

(తరువాయి 4లో...)








# మేమింతే..!

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, డిశంబర్ 22)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానానికి ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం పొన్నలూరు మండలం వేంపాడు గ్రామ పంచాయితీ పరిధిలో అధికార పార్టీ నాయకులు గండి కొడుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో పాలేరు నదీ పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా తరలింపు జరుగుతుందని అప్పుడు ఫిర్యాదులు చేసిన స్థానిక నాయకులు ప్రభుత్వం మాది మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరు అన్నట్లు బరితెగించి గతాన్ని మరచి యథేచ్ఛగా ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తూ బరిస్తున్నారు. పాలేరు నదీ పరీవాహక ప్రాంతంలో ఇసుక తరలింపు తవ్వకాలు చేసేందుకు ప్రభుత్వ అనుమతి లేదు. పూర్తిగా వ్యవసాయ ఆధారం పాలేరు పరీవాహ ప్రాంతం కావడం తో ఇసుక తవ్వకాలు తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ సాగుకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని సర్పంచ్ భర్త దాసరి రవీంద్ర బాబు మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ ఎటువంటి అనుమతులు ఇసుక తరలింపు తవ్వకాలకు లేదని స్పష్టం చేస్తున్నా పొన్నలూరు పోలీస్ అధికారులు ఇసుక అక్రమ రవాణాపై అప్పుడు అట్లా ఇప్పుడు ఇట్లా అన్న తీరులో వ్యవహరిస్తున్నారని, పోలీస్ అధికారులు బెదిరింపులకు గురి చేస్తున్నారని దాసరి రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. వేంపాడు గ్రామ పంచాయితీ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు తరలింపులో కీలక పాత్ర ధారి దాసరి కృష్ణా రావు వ్యవహారాన్ని సర్పంచ్ భర్త దాసరి రవీంద్ర బాబు గ్రామంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను నియంత్రించి ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం అమలు జరిగేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ భర్త దాసరి రవీంద్ర కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ ఇసుకాసురలపై చర్యలు తీసుకొని పంట పొలాలను కాపాడుతారో లేదో కాలమే నిర్ణయించాలి.

# స్మార్ట్ కిడ్స్‌లో అట్టహాసంగా మ్యాథ్స్ ఫెయిర్

అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజారెడ్డి, ప్రిన్సిపల్ శిరీష , ఉపాధ్యాయునిలు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో కలపాలి

## అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిశంబర్ 22)

సోమవారం కందుకూరు నియోజకవర్గంను ప్రకాశం జిల్లాలో కలపాలని కందుకూరు పోస్ట్ ఆఫీస్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం జరుగుతుందని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలకు అతీతంగా జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని కోరారు .అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు అన్నట్లుగా ఉద్యమాలు చేయకుండా ఏదీ సాధించలేమని దానిలో భాగంగానే రాజకీయాలకు అతీతంగా ధర్నా జరుగుతుందని నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ప్రకాశం జిల్లాలో కందుకూరు నియోజకవర్గం కలపాలని ఉన్నందున ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

# కిట్స్ లో ఘనంగా గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, డిశంబర్ 22)

స్థానిక కిట్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ,మ్యాథమెటిక్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని ఆదివారం నేషనల్ మ్యాథమెటిక్స్ డే వేడుకలు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్నా క్రిష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కళాశాల ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పివి అనిల్ కుమార్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని, నేషనల్ మ్యాథమెటిక్స్ డే వేడుకలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పై క్విజ్ ప్రోగ్రామ్ నిర్వహించి అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామన్నారు. అలానే విద్యార్థిని, విద్యార్థులు కూడా, మ్యాథమెటిక్స్ డే గురించి ప్రజెంటేషన్ చేశారని తెలిపారు. కళాశాలలో మ్యాథమెటిక్స్ బోధించే ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రంగనాయకులు, కళాశాల ఏవో బి.ప్రభాకర్, వివిధ విభాగపు అధిపతులు పి రామ్మోహన్, డాక్టర్ జెవి అనిల్ కుమార్, కే రాముడు, కే కిషోర్ బాబు, ప్రసన్న మురళి , జే రమణారెడ్డి,ఏ. అమృతవల్లి , పి మనోహర్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎన్ రంగస్వామి, ఎన్ వి ఎస్ ఎన్ అంజనీ కుమార్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత







చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. సింగరాయకొండలో 95 లక్షలతో ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. దివ్యాంగుల కొరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో విశాఖపట్నం లో 200 కోట్ల రూపాయలతో 20 ఎకరాల్లో క్రీడా స్టేడియం ను నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. గెలుపు ఓటములు సర్వ సాధారణమైన విషయమని, క్రీడా స్ఫూర్తి గొప్పదని మంత్రి అన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని మంత్రి తెలిపారు. క్రీడలతో పాటు చదువులో కూడా మంచిగా రాణించి, ఉన్నత విద్యను అభ్యసించి స్పోర్ట్స్ కోటాలో చదువులోగాని, ఉపాధి లో గాని మంచి అవకాశాలు పొందాలని మంత్రి తెలిపారు. క్రీడలను పాకలలో ఏర్పాటుచేయడం పట్ల విద్యా శాఖ అధికారులను, నిర్వాహకులను, దాతలను ప్రత్యేకంగా మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. క్యారమ్స్ రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 400 క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ గేమ్స్ పరిశీలకులు స్వర్ణ రాజు, పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎండి హజీరా బేగం, ఎం ఈఓ శ్రీనివాస రావు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ పార్టీ

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి కందికట్ల

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)



గత 60 సంవత్సరాలుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అనేక రకాలుగా అవమానించిన కాంగ్రెస్ పార్టీ అని బీజేపీ నాయకులు అన్నారు. గతవారం పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరించి, డాక్టర్ అంబేద్కర్‌ను మళ్లీ మళ్లీ "అవమానించిన విధానానికి" వ్యతిరేకంగా నెల్లూరు వీఆర్‌సి సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ముందు "నిరసన" తెలియజేసి..విగ్రహానికి క్షీరాభిషేకం చేసి "పుష్పాంజలి" సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి "బైరి శ్రీనివాస్" ,రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి కందికట్ల మాట్లాడుతూ రెండుసార్లు ప్రత్యక్ష ఎన్నికలలో డాక్టర్ అంబేద్కర్‌ను అవమానకర రీతిలో "ఓడించిన చరిత్ర" కాంగ్రెస్ పార్టీది అన్నారు. దేశానికి ఎనలేని సేవ చేసిన డాక్టర్ అంబేద్కర్‌కి "భారతరత్న" ఇవ్వకుండా "అవమానించిన చరిత్ర" కాంగ్రెస్ పార్టీదన్నారు. అలాంటి నీచ సంస్కృతి, చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి అంబేద్కర్ పేరు ఉచ్చరించే నైతిక హక్కు లేదని తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ పేరును తమ యొక్క నీచ రాజకీయాలకు వాడుకుంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు".2014లో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన "నరేంద్ర మోడి" మొదటిసారి పార్లమెంట్‌లో మాట్లాడుతూ తన లాంటి వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తి భారతదేశానికి ప్రధానమంత్రి అయ్యాడంటే ,ఆ గొప్పతనం డాక్టర్ అంబేద్కర్ రాసిన "రాజ్యాంగానికి దక్కుతుందని"తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ జీవితంతో ముడిపడిన ఐదు ప్రాంతాలను "పంచతీర్థాలు"గా అభివృద్ధి చేసిన ఘనత నరేంద్ర మోడికి, బిజెపి దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి కందికట్ల, ఎస్సి మోర్చా అధ్యక్షులు పరుశు మధు, జిల్లా కార్యదర్శి మంద శ్రీనివాసులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అశోక్,నాయకులు రాములు, మదన్,రఘురామయ్య, సుబ్బారావ్, మస్తాన్ గౌడ్, కిషోర్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో చదవటం మాకు ఇష్టం కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 22)

మండల కేంద్రమైన ఉలవపాడు గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ పాలకుడు డి.ఆధ్వర్యంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల చేత వివిధ రకాల నీతి కథల పుస్తకాలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదువుతూ, క్యారమ్స్ ఆడించడం జరిగింది. ఈ పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులలో మంచి భావనలు నాలెడ్జ్ తిరుగుతుందని విద్యార్థులను తల్లిదండ్రులు గ్రంథాలయాన్ని పంపించడం ద్వారా వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు. అదేవిధంగా ఉలవపాడు గ్రంథాలయానికి అనుసంధాన మైనటువంటి చాకిచెర్ల గ్రంథాలయంలో లైబ్రరీ యన్ రాణమ్మ ఆధ్వర్యంలో చదవటం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ఐదుగురికి సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, డిశంబర్ 22)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాస్పిటల్స్‌లో చికిత్స పొందిన రోగులకు సీఎం సహాయ నిధి నుండి 5 మందికి చెక్కులు ఆదివారం మార్కాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో అందించారు. చెక్కులు పొందిన వారిలో బత్తుల నాగేంద్రబాబుకు రూ.76,700, రెడ్డెబోయిన శ్రీనివాసులకు రూ.43,300, పల్లెకొండ శైలజకు రూ.51,500, కటకం వెంకట్‌రెడ్డి కి రూ.37,192, దండ బోయిన వెంకటేశ్వర్లుకు రూ.64,809 మొత్తంగా రూ.2,73,501ల చెక్కులను అందించారు. అదే విధంగా మార్కాపురం నియోజకవర్గంలోని మన టిడిపి యాప్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి అభినందించారు.

# హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ఒంగోలు ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు అన్నారు. రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు టౌన్ లో ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని, కావున ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారురు. హెల్మెట్ ధరించని వారి పై కఠినంగా ఎంవిఐ యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించడం జరుగు తుందన్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత, మీ కుటుంబం యొక్క ఆనందం గురించి ఆలోచించాలని అధికారులు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది, రాయల్ ఎన్ఫీల్డ్ షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.







# కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం చీఫ్ విప్ జీవీ





లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన జీవీ

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, డిశంబర్ 22)**

కూటమి పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సంక్షేమంతో పాటు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సకాలంలో నిస్సహాయులకు అండగా నిలవడం ఎంతో సంతోషం, సంతృప్తిని ఇస్తోందన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నలుగురికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6 లక్షల విలువైన ఆర్థిక సాయం చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో చివరి లబ్దిదారులకు వరకు కూడా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్లు తెలిపారు.

# పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కలిసిన మైనార్టీ అధ్యక్షుడు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇంచార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వైసిపి మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు సిద్దిక్గారు కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సిద్దిక్ అభినందనలు తెలియజేసిమైనార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హంజా హుసేని, మైనార్టీ నాయకులు అబ్దుల్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఏకాగ్రత మెరుగుపరచడానికి పుస్తక పఠనం





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)**

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలు నందు చదవటం మా కిష్టం కార్యక్రమం ఉదయం 10 నుండి 12 గంటల వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ముందుగా పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం లింగిశెట్టి అశోక్ కుమార్, (మాస్టర్ ఇన్ కంప్యూటర్ సైన్స్ లెక్చరర్) వారు పిల్లలకు మోటివేషన్ కథలు, నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదువుతూ, పిల్లలతో సొంతంగా కథలు చెప్పించటం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏకాగ్రత మెరుగుపరచడానికి పుస్తక పఠనం సాయం చేస్తుంది. ఎవరి ఆసక్తిని బట్టి వారు పుస్తకాలు చదివితే ఆ ఆసక్తిని అనుసరించి జీవితంలో ఏదైనా సాధించాలి అనే లక్ష్యం ఏర్పడుతుందని, పుస్తకాలు చదవడం మన అభిరుచిని పెంచుతుంది. అందువల్ల పిల్లలందరూ కూడా చిన్నతనం నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పి ఇమ్మానుయేలు, యస్ అనిల్ బాబు, పాఠకులు పాల్గొన్నారు.

# మాలలు మానవ హక్కుల యోధులు

## అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించినా ప్రశ్నించని మాదిగలే మనువాదులు
## పివిరావు 19వ వర్ధంతి సభలో దళిత నేత నీలం






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)**

మాలలు మానవ హక్కుల యోధులని, అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాను ప్రశ్నించని మాదిగలే మనువాదులని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు అన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో ఆదివారం జరిగిన మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పీవీ రావు 19 వ వర్ధంతి సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ మాలల జీవనం, ఉద్యమ ప్రస్థానం వాలీత కాదని, ఎదురీత అన్నారు. మాలలు చంద్రబాబు తల్లి అమ్మణమ్మ కాళ్లు మొక్కి ఉద్యమాన్ని ప్రారంభించలేదని, చంద్రబాబు తమ్ముడు రామ్మూర్తి నాయుడు చనిపోతే తప్పెట్లు కొట్టలేదన్నారు. అగ్రవర్ణాలకు అగ్రకులాలకు వ్యతిరేకంగా మాలలు ఉద్యమాలు నడిపారే తప్ప, అగ్రకులాల చందాలతో ఉద్యమాలు నడిపిన చరిత్ర మాలలకు లేదన్నారు. మహాత్మా గాంధీని ఇంటికి పిలిపించుకున్న కుసుమ ధర్మన్న మాల అని, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన భాగ్యరెడ్డి వర్మ, బిఎస్ వెంకట్ రావులు మాలలని, ఆంధ్రప్రదేశ్ ఏకైక దళిత ముఖ్యమంత్రిగా, ఏఐసీసీ అధ్యక్షుడుగా పనిచేసిన దామోదరం సంజీవయ్య మాల అని, పీపుల్స్ వార్ పార్టీ వ్యవస్థాపకుడు కేజీ సత్యమూర్తి మాల అని, దళితులను అవమానించారని అసెంబ్లీ సాక్షిగా రెడ్డి కులస్తుడ్ని చెప్పుతో కొట్టిన ఈశ్వరి భాయి మాల అని గుర్తుంచుకోవాలన్నారు. తన సంచి మోసాడని తెలంగాణకు చెందిన మంద ఏలియాకు కృష్ణ అని పేరు పెట్టిన కేజీ సత్యమూర్తి మాల అన్నారు. హరిహర తనయుడు అయ్యప్ప అయితే, చంద్రబాబు మందకృష్ణ తనయ వర్గీకరణ ఉద్యమం అన్నారు. దేశంలో వేలాది ఘటనలో దళితుల నెత్తురు చిందిందని, కారంచేడు మాదిగలపై జరిగిన మారణకాండ నేపథ్యంలో ఆవిర్భవించిన దళిత ఉద్యమాన్ని నిర్మించింది కత్తి పద్మారావు బొజ్జతారకం మాలలే అన్నారు. దళిత మహాసభ పేరుతో జరిగిన ఉద్యమం కోసం వేలాది మంది మాలలో చదువులు మానేసి కెరియర్లు వదిలేసి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని వ్యక్తిగత జీవితాలను కోల్పోయారన్నారు. 1994లో బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్లోకి రావడంతో చంద్రబాబు నాయుడు, మందకృష్ణ మాదిగ కుట్రలోంచి పుట్టిందే వర్గీకరణ సిద్ధాంతం అన్నారు. చంద్రబాబు ఆఘమేఘాల మీద రామచంద్ర రాజు కమిషన్ ఏర్పాటు చేయడం, వర్గీకరణ కోసం జీవో ఇవ్వటం, వేలాది ఉద్యోగాలను మాదిగలకు కట్టబెట్టడం చేశారన్నారు. దళితులు రాజ్యాధికారానికి రాకుండా ఉండేందుకు దళితుల మధ్య శాశ్వతమైన చీలిక కోసం వర్గీకరణకు చంద్రబాబు ప్రాణ ప్రతిష్ట చేయడంతో పాటు, ఆయుషు పోసాడన్నారు. చంద్రబాబు ప్రాయోజిత వర్గీకరణ ఉద్యమానికి వ్యతిరేకంగా పివి రావు తన జీవితాన్ని త్యాగం చేశాడన్నారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి మద్దతుగా మాల మహానాడు ఏర్పాటు చేశారన్నారు. మాల మహానాడు పిలుపుమేరకు హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో మాలలను చంద్రబాబు గుర్రాలతో తొక్కించాడన్నారు. ఈ ఘటనలో పోలంకి శేషయ్య, గుడిపూడి నారాయణ అమరులయ్యారన్నారు. పివి రావు 53 సంవత్సరాల వయసులో మరణించారన్నారు. గ్రూప్ 1 అధికారిగా సమాచార శాఖ డైరెక్టర్ గా పనిచేసే క్రమంలో, చంద్రబాబు పివి రావును సస్పెండ్ చేయించారన్నారు. ఆయన క్వార్టెను కూడా అవమానకరంగా ఖాళీ చేయించారన్నారు. ఆర్థిక భారంతో పాటు, ప్రభుత్వ వేధింపులు అవమానాలతో, ఉద్యమ బాధ్యతలను భుజానికి ఎత్తుకొని వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీ వెళ్లి సుప్రీంకోర్టు హాజరై, అక్కడ అస్వస్థతకు గురై పివి రావు మరణించాడు అన్నారు. చిన్న వయసులో మరణించినా పివి రావు మాల జాతి ఉన్నంతవరకు మాల ప్రజల గుండెల్లో ఉంటారన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా, పివి రావు ఆశయాలను మాలలు కొనసాగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ప్రధాన కార్యదర్శి కాకుమాను రవి, దళిత నాయకులు దేవరపల్లి రమణయ్య, ముత్తన పోతురాజు, కసుకుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి క్యాలెండర్‌లను ఆవిష్కరించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



## ఎమ్మెల్యే కార్యాలయంలో కోలాహలం

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)**

నెల్లూరు రూరల్ 29వ డివిజన్‌కి చెందిన నవీన్‌రెడ్డి, గీతాకృష్ణ రూపొందించిన గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నూతన సంవత్సర క్యాలెండర్‌లను నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం నెల్లూరు నగరంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్కటి క్యాలెండర్‌ను రూపొందించారని అభినందించారు. ప్రతి డివిజన్లో నాయకులు ప్రజలతో మమేకమై అందుబాటులో ఉండాలన్నారు. గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమం అద్భుతంగా సాగుతుందన్నారు. అనంతరం 29వ డివిజన్ కు చెందిన యువనేత నవీన్ రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం వెనక కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. చరిత్రలో శ్రీరాముడికి లక్ష్మణుడు లాగా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నిరంతరం అన్న శ్రీధర్‌రెడ్డి వెనక అండదండగా ఉన్నారన్నారు. టిడిపి నాయకులు గీతా కృష్ణ మాట్లాడుతూ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గడపగడప కార్యక్రమంకు పెద్ద ఎత్తున స్పందన లభిస్తోందని భవిష్యత్తులో కూడా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఈ క్యాలెండర్లను రూపొందించామని రూరల్ నియోజకవర్గం లో గడపగడపకు వీటిని పంపిణీ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ కనుపర్తి గంగాధర్, టిడిపి 29వ డివిజన్ ఇంచార్జ్ గుద్దేటి చెంచయ్య, టిడిపి మైనార్టీ అధికార ప్రతినిధి అస్లాం, నారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి, రవి కుమార్‌రెడ్డి, మౌలాలి, షాజహాన్, శివ, గోవర్ధన్, చంద్ర, వెంగబాబు, కృష్ణ, మస్తాన్ వలి, దస్తగిరి, వినయ్, రజిని, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన బెల్లంకొండ విజయలక్ష్మి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)**

ఆదివారం ఉదయం ఒంగోలు విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరిని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పుష్పగుచ్ఛం అందజేసి పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

# ఏకాభిప్రాయంతోనే నిర్ణయాలు ప్రజల సమస్యలు తీర్చిన వాడే నాయకుడు

**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, డిశంబర్ 22)**

మండలంలోని వైఎస్సార్ సీపీ నూతన కమిటీల నియామకంలో సమష్టిగా ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవటం తప్ప ఏకపక్ష నిర్ణయాలు ఉండవని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీలను నియమిస్తామని రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రకటించారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం పార్టీ నూతన కమిటీల ఏర్పాటు పై పెద్దారవీడు మండల నాయకులతో గ్రామీల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయటమే లక్ష్యంగా నాయకులతో చర్చించి ఆమోదయోగ్యమైన వ్యక్తిని అధ్యక్షునిగా నియమిస్తారని, అతని నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఏ సమస్య అయినా సమష్టి నిర్ణయాలతోనే పరిష్కరిస్తామని వివ రించారు. పార్టీలో గ్రూపు రాజకీయాలు సహించనని గ్రూపులు కట్టేవారు పార్టీకి అవసరం లేదన్నారు. రాష్ట్రంలో పార్టీ జెండా ఎగురవేయటమే లక్ష్యంగా కృషి చేస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రజల పక్షన ఉంటానని అన్నారు. కూడా ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతున్నప్పటికీ అభివృద్ధి శూన్యం అన్నారు. మన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామని అన్నారు.





# నాలుగో సారి కాట్వా కనిగిరి నియోజకవర్గ ఏమినెంట్ పర్సన్‌గా ఎంపీటీసీ ఆకుపాటి

**(షణ్ముఖ వెలుగు, పామూరు, డిశంబర్ 22)**

ఏపీ కాట్వా ప్రకాశం జిల్లా పదో వార్షికోత్సవ కార్యక్రమం సందర్భంగా జిల్లా కాట్వా వారి ఆహ్వానం మేరకు కనిగిరి నియోజకవర్గ కాట్వా ఎమినేట్ పర్సన్‌గా పామూరు పట్టణానికి చెందిన ప్రకాశం జిల్లా ఎంపీటీసిల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ వరుసగా నాలుగోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాట్వా గురించి తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ పదవ తరగతిలో 550 మార్కులు పైబడిన 7 మంది విద్యార్థులకు 20 వేల రూపాయలు తనవంతుగా స్కాలర్షిప్ రూపాన అందజేయడం జరిగింది. అనంతరం ఏపీ కాట్వా కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ ఆకుపాటి వెంకటేష్‌ని ఘనంగా సన్మానించి మెమొంటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాట్వా వ్యవస్థాపకులు కొల్లా నారాయణ, ఫణీంద్ర కుమార్, జిల్లా కాట్వా అధ్యక్షులు బి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, తూము శ్రీనివాసరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, కుప్ప రంగ సాయి, మలగా రమేష్,జిల్లా ఎక్స్యూట్ మెంబర్ గద్దె సుధాకర్, కొంకనాల రామ్మోహన్‌రావు, ఎన్ వెంకటరామయ్య, నరసింహారావు జిల్లా కాట్వా సభ్యులు మరియు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎంపి దగ్గుపాటి పురందేశ్వరికి వినతిపత్రం అందించిన

# టూ వీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)**

ఆంధ్రప్రదేశ్ టూ వీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టూ వీలర్ వర్కర్స్ సమస్యలపై ఆదివారం ఒంగోలు విచ్చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరికి రాష్ట్ర టూవీలర్ అసోసియేషన్ అధ్యక్షులు దాయనేని ధర్మ మౌర్య హెూటల్ నందు వినత పత్రం అందజేశారు. ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా ఎనిమిది లక్షల మంది కార్మికులము కులమతాలకతీతంగా ఉపాధి పొందుతూ సమాజ అవసరాలను తీర్చేందుకు అగ్రభాగాన నిలిచిన మా టూ వీలర్స్‌మెకానిక్ సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారం దిశగా మీ సహాయం అభ్యర్థిస్తున్నాము. మా సమస్యలు మీవిగా భావించి వాటి పరిష్కారం దిశగా పనిచేయదలచిన మీకు మా కార్మికుల తరపున ఎల్లప్పుడూ కృతజ్ఞతగా ఉంటామని ఈ సందర్భంగా తెలియజేసు కుంటున్నాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత శక్తివంతమైన కార్మిక సంఘాలలో ఒకటైన ఈ టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్లో ఒక సభ్యునిగా ఉన్నందుకు గర్విస్తూ మా సమస్యలు ఈ క్రింద ఉదహరించారు. వాటిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి టూ వీలర్ మెకానిక్కు కార్మికశాఖ ద్వారా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం మన టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలి. టూ వీలర్ వెల్ఫేర్ బోర్డ్ ద్వారానే ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కార్మికునికి ప్రమాదభీమా వైద్య సాయం కోసం సాధారణ, ప్రమాదవశాత్తు జరిగే మరణాలకు ఆయా కుటుంబాలకు ఆర్థికంగా నిలదొక్కు కొనేందుకు సహాయం చేయాలి. ప్రస్తుతం టూ వీలర్స్



మెకానిక్ వృత్తిలో వచ్చిన విప్లవాత్మక నూతన. బి.యస్5, బి.యస్ 6 టెక్నాలజీనీ ప్రభుత్వ ఈ వెల్ఫేర్ బోర్డ్ ద్వారా కార్మికులకు నేర్పించాలని, ఎలక్ట్రికల్ బైకులు, స్కూటర్ల మరమత్తులు చేయడం వంటివి నేర్పించడం తద్వారా నూతన తరానికి కూడా ఈ రంగంలో ఉపాది అవకాశాలు మెరుగు పరచేందుకు , స్వతంత్రంగా ఆత్మగౌరవంతో జీవించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్మిక శాఖ ద్వారా గుర్తింపు పొందిన , లైసెన్స్ కలిగిన ప్రతి టూ వీలర్ మెకానిక్ వృత్తి షాపు వారికి ప్రస్తుతం ఈ వృత్తిలో వచ్చిన ఆధునిక పనిముట్లు కొనుగోలు చేసుకొని మరింత మంది ఉపాది కల్పించేందుకు గాను ఏ విదమైన ష్యూరిటీ లేకుండా వడ్డీలేని కనీసం రూ.3,00,000ముద్రా రుణాలు మంజూరు చేయాలని, తద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలన్నారు. 55 సంవత్సరాలు దాటిన అర్హులైన పేదవారైన ప్రతి మెకానిక్కు మా వెల్ఫేర్ బోర్డు ద్వారా ప్రతినెల కనీసం రూ.5,000లు ఫెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతి జిల్లా హెడ్ క్వాటర్లో టూ వీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణం కొరకు స్థలం కేటాయించాలన్నారు. పార్టీకి అండగా ఉంటున్న టూ వీలర్, 3వీలర్, 4వీలర్, 6వీలర్ మెకానిక్స్ సోదరులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలోని 26 జిల్లాలో ఉన్న సుమారు 30 లక్షలు పైచిలుకు ఉన్న మెకానిక్ కార్మికులకు, వారిపై ఆధారపడిన వారి కుటుంబసభ్యులను దృష్టిలో ఉంచుకొని మెకానిక్ అందరికి కలిపి వారికోసం ఒక కార్పోరేషన్ ను ఏర్పాటు చేసి వారికి ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పాటు ప్రమాధభీమా, ప్రస్తుతం అడ్వాన్స్ టెక్నాలజీని దృష్టిలో ఉంచుకొని స్కిల్ డెవలప్మెంట్స్ ప్రోగ్రామ్లు ఏర్పాటుచేసి వారికి శిక్షణ ఇప్పించి, అవసరమయ్యే పరికరాలను సబ్సిడీ ద్వారా అందజేయాలని కోరారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వము మెకానిక్స్ సోదరులను గుర్తించి ఏ విధమైన సహాయ సహకారములు అందజేయలేదన్నారు. పైన తెలిపిన వాటిని పరిశీలించి కార్యరూపం దాల్చి మాకు తగిన గుర్తింపును ఇచ్చి, మాకు తగిన తోడ్పాటును ఇవ్వవలసినదిగా కోరారు. సమస్యలపై స్పందించిన పురందేశ్వరి చర్చిస్తానని తెలిపారు.

# ఈ నెల 31న అన్లాక్ 2025 వేడుకలు

### వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దామచర్ల

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)**

హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలల్లో 31 రాత్రి జరిగే ఈవెంట్ వేడుకలకు దీటుగా ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి ఇప్పుడు ఒంగోలులో ఫ్రైడ్ మీడియా ఆధ్వర్యంలో అన్లాక్ 2025 సంబరాల ఈవెంట్ వేడుకలు నగరంలోని అర్జున్ ఇన్ఫ్రా లో ఈ నెల 31 సాయంత్రం గ్రాండ్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ప్రముఖ సింగర్ యశస్వి తెలిపారు. ఒంగోలు నగరంలో అర్జున్ ఇన్ఫ్రాలో ఫ్రైడ్ మీడియా వారు నిర్వహిస్తున్న అన్లాక్ 2025 ఈవెంట్ కి సంబంధించిన టికెట్ లాంచింగ్ కార్యక్రమం వై ప్యాలెస్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ , ప్రముఖ సింగర్ యశస్వి , అర్జున్ ఇన్ఫ్రా ఎండి బొమ్మిశెట్టి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మీడియాతో మాట్లాడుతూ ఒంగోలులో గత 10 సంవత్సరాల నుంచి ఫ్రైడ్ మీడియా యాజమాన్యం గోరంట్ల వెంకటేష్ అనేక కార్యక్రమాలు చేస్తూ ప్రజలలో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఇంత పెద్ద ఈవెంట్ ఫ్రైడ్ మీడియా ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని నా నియోజకవర్గంలో ఇలాంటి ఈవెంట్ ఏర్పాటు చేసి నాకు మంచి పేరు తీసుకొని వస్తున్నా ఫ్రైడ్ మీడియా యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సరికొత్త ఈవెంట్స్ నిర్వహిస్తున్న ఫ్రైడ్ మీడియా యాజమాన్యానికి నా సపోర్ట్ ఎప్పుడు ఉంటుందన్నారు. ఈవెంట్ ఆర్గనైజర్ గోరంట్ల వెంకటేష్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పెద్ద ఎత్తున సరికొత్తగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఈవెంట్‌కు ప్రముఖ సింగర్ యశస్వి తన సొంత లైవ్ బ్యాండ్‌తో పాల్గొంటారన్నారు.ఒంగోలు ప్రజలను దృష్టిలో పెట్టుకొని తక్కువ ధరకు వినోదం అందిస్తున్నామని, రకరకాల ఫుడ్ తోపాటు, బేవరేజెస్ డ్రింక్ కూడా అందిస్తున్నామని తెలిపారు. అన్‌లాక్2025 ఈవెంట్‌కు అర్జున్ ఇన్ఫ్రా ఫుల్ సపోర్ట్ ఇస్తుందన్నారు , ఈ నెల 31 జరిగే న్యూ ఇయర్ వేడుకలు ఒంగోలు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.అర్జున్ ఇన్ఫ్రా ఎండి బొమ్మిశెట్టి శంకర్ మాట్లాడుతూ ఫ్రైడ్ మీడియా వారు నిర్వహిస్తున్న నూతన సంవత్సర వేడుకలు అర్జున్ ఇన్ఫ్రా లో నిర్వహించడం మాకు చాల సంతోషంగా ఉందన్నారు . అన్లాక్ 2025 టికెట్ లాంచింగ్ కార్యక్రమంలో సాయి బాబ టైల్స్ ఎండి సాయి కృష్ణ , ఎవాక్ స్టైల్ క్లబ్ ఎండి అన్నపూర్ణ అల్లురయ్య , సితార హన్డ్లూమ్స్ ఎండి సాయి చరణ్ , శ్రీ విష్ణు యమహా ఎండి విష్ణు , స్నేహ ఎలక్ట్రానిక్స్ ఎండి హేమంత్ ,మేఘన మెడికల్స్ ఎండి రఘురామిరెడ్డి , జాయ్ ఫెర్టిలిటీ ఎండి నోయెల్ జాన్ , కోటీస్ షాపింగ్ మాల్ ఎండి సూర్య నారాయణ , వి డెంటిస్ట్ ఎండి హనుమంత రావు , కేటి స్మార్ట్ హెూం ఎండి , వై ప్యాలెస్ ఎండి, ఏకే ఫోటోగ్రాఫి ఎండి సాయి, రవి వాటర్ సోలుషన్స్ ఎండి రవి, తదితరులు పాల్గొన్నారు




# ఆల్ ఇండియా స్థాయిలో జూడో క్రీడకు ఆంధ్ర కేసరి యూనివర్శిటీ క్రీడాకారిణి ఎంపిక



### అభినందించిన ఏకేయూవిసి, రిజిస్ట్రార్ తదితరులు


### ఏపి నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారిణిగా ఉషశ్రీ గుర్తింపు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)**

ఇటీవల కాలంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం లోని భోపాల్ నందు గల ఎల్.ఎన్.సి.టీ. విశ్వ విద్యాలయం నందు జరిగిన జూడో పోటీలలో 78 కిలోల విభాగంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ తరుపున సౌత్ – వెస్ట్ జోన్ మహిళల జూడో పోటీలలో పాల్గొన్న జి.ఉషశ్రీ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి అఖిల భారత స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనేందుకు సౌత్ – వెస్ట్ జోన్ తరుపున ఎంపికయ్యారు.ఎల్.ఎన్. సి.టి. విశ్వ విద్యాలయం నందు ఉత్కంఠ భరితంగా జరిగిన పోటీలలో అఖిల భారత స్థాయిలో ఆడేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న అనేక విశ్వ విద్యాలయాలకు చెందిన క్రీడాకారిణులు పోటీ పడగా, ఉషశ్రీ తన ఆటలో అద్భుతమైన ఆటను ప్రదర్శించి సీనియర్ ఆటగాళ్లను సైతం పక్కకు నెట్టి ఆల్ ఇండియా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో క్రీడలకు పుట్టినిల్లు అయిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి కూడా ఆల్ ఇండియా జట్టుకు ఎవరూ ఎంపిక కాలేదు. అయితే నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్శిటీకి చెందిన జూడో క్రీడాకారిణి ఉషశ్రీ ఎంపిక కావడం పట్ల ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబు తదితరులు హృదయ పూర్వకంగా ఉషశ్రీ కి అభినందనలు తెలిపారు. భవిష్యత్ లో ఉషశ్రీ బంగారు పతకం సాధించి ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప జేయాలని వి.సి,రిజిస్ట్రార్ తదితరులు ఆకాంక్షించారు. ప్రస్తుతం సౌత్ – వెస్ట్ జోన్ తరుపున జూడో మహిళల 78 కిలోల విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో పంజాబ్ రాష్ట్రంలో లోని అమృతసర్ నగరంలో ఉన్న గురునానక్ దేవ్ యూనివర్సిటీ నందు జనవరి 17 నుంచి 19వ తేది వరకు జరుగనున్న ఆల్ ఇండియా పోటీలలో ఉషశ్రీ పాల్గొనడం జరుగుతుందని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ. దేవీ వర ప్రసాద్ ఆదివారం సాయింత్రం విలేఖరులకు తెలిపారు. ఉషశ్రీ ప్రస్తుతం సింగరాయ కొండ లోని మోక్షిత ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో మొదటి సంవత్సరం డి.పి.ఎడ్ చదువుతోంది. గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగిన ఉషశ్రీ ప్రస్తుతం అఖిల భారత స్థాయిలో జరిగే 78 కిలోల విభాగం పోటీలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారిణిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.ఆల్ ఇండియా స్థాయిలో పంజాబ్ లోని అమృతసర్ నగరంలో జరగనున్న పోటీలలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న ఆంధ్ర కేసరి యూనివర్శిటీకి చెందిన క్రీడా కారిణి ఉషశ్రీ కి అభినందనలు తెలిపిన వారిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జూడో విభాగం అధ్యక్షుడు నామినేని. వెంకట్, ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజ మోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలా మణి, ఏ.కే.యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవీ వర ప్రసాద్, అతిథి అధ్యాపకులు అడపాల. వెంకట్ తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

## వివాహా వేడుకకు హాజరైన మంత్రి ఆనం





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)**

నెల్లూరు నగరంలోని పీవీఆర్ కళ్యాణ మండపంలో జిల్లా పరిషత్ పరిపాలన అధికారి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రైవేట్ సెక్రటరీ అర్షఫ్ కుమారుని వివాహ వేడుకకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హాజరయ్యారు. కుటుంబ సమేతంగా విచ్చేసి వధూవరులను మంత్రి ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, అబ్దుల్ అజీజ్, ఆనం వెంకట రమణారెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

## అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా చిట్టెంశెట్టి వెంకట కృష్ణరావు ఎన్నిక







**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)**

నెల్లూరు పట్టణంలోని పరమేశ్వరి కళ్యాణ మండపంలో గాండ్ల తెలికుల సంక్షేమ సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశం నందు రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ప్రకాశం జిల్లా పొదిలి పట్టణానికి చెందిన చిట్టెంశెట్టి వెంకటకృష్ణారావు గాండ్ల సామాజిక వర్గానికి చేసిన కృషిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పొదిలి యూనిట్ గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి, ప్రకాశం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బచ్చల శివప్రసాద్, వరికుంట్ల వెంకటేశ్వర్లు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు ప్రకాశం జిల్లా యూత్ కన్వీనర్ బోయిర్ల రోషన్ బాబు,గాండ్ల సంక్షేమ సంఘం నాయకులు ,తెలుగుదేశం పార్టీ నాయకులైన చిట్టెంశెట్టి శ్రీనివాసులు,పెద్ద సుబ్బారావు,చిన్న సుబ్బారావు, శ్రీనివాసులు, శివయ్య, ప్రభాకరు, ఏరువ వెంకటరామయ్య, నిమ్మయ్య,వరికుంట్ల వెంకటేశ్వర్లు(సరైనోడు) గుంటక కృష్ణ,ఊటుకూరి ప్రసాదు,వరికుంట్ల హనుమంతరావు,దాసరి నాగరాజు, ఆళ్ళచెరువ, తదితరులు పాల్గొన్నారు.

## విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

**(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, డిశంబర్ 22)**

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ వారి ఆధ్వర్యంలో టంగుటూరు మండలం కందులూరు గ్రామంలో బీజామృతంతో శనగలకు విత్తన శుద్ధి చేయడం జరిగింది .విత్తన శుద్ధి వల్ల జరిగే ఉపయోగాలు గురించి యూనిట్ ఇన్చార్జ్ విజయలక్ష్మి రైతులకు ఈ విత్తన శుద్ధి వల్ల పంటకు వచ్చే వివిధ తెగుళ్లను నివారించవచ్చునని అలాగే మొక్క ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది అని అన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏ.సుజాత మాట్లాడుతూ శనగ వేసి ప్రతి రైతు విత్తన శుద్ధి చేయించుకోవాలని, అలాగే ఈ ప్రకృతి కషాయాలు వల్ల పంట రాబడికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందులూరు గ్రామంలోని ఎస్‌హెచ్‌జి మహిళలు రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది త్రివేణి, మరియమ్మ పాల్గొన్నారు.



## రాళ్లపాడు ప్రాజెక్టు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే ఇంటూరి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిశంబర్ 22)
కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గత తొమ్మిది రోజులుగా రాళ్లపాడు ప్రాజెక్టులో ఇబ్బందికరంగా పరిణమించిన కుడి కాలువ షట్టర్ సమస్యను సంబంధితశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్ళారు. రాళ్లపాడులో చివరి పంట పొలాల రైతులకు సైతము నీరు సంపూర్ణంగా అందిస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. రాళ్లపాడు ప్రాజెక్టులో సత్వరమే చేపట్టవలసిన పలు పనులను ఆయన నీటిపారుదల శాఖ అధికారుల నుండి నివేదికలు తీసుకొని సంబంధిత శాఖ మంత్రి సమర్పించారు. ఆదివారం అదనంగా మరో రెండు పెద్ద మోటార్లతో నీరు సరఫరా చేస్తున్నారు. మొత్తం ఈరోజు నాలుగు పెద్ద మోటర్లు, 75 హార్స్ పవర్ కలిగినవి, నిరంతరాయంగా నీరు సరఫరా చేయనున్నట్లు ఆయన చెప్పారు. దీంతో సాయంత్రానికల్లా 160 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. నిమ్మల రామానాయుడు ఆదేశానుసారం నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదివారం ఉదయం రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. ఆయన ప్రాజెక్టు వద్ద 35. నిమిషాల పాటు రాళ్లపాడు రైతులతో పలు అంశాలను చర్చించారు. రైతులకు నీరందించడంలో రాజీ పడబోమన్నారు. కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ కూడా పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మర తనిఖీలు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)
నెల్లూరు జిల్లా వ్యాప్తంగా జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు ఆదివారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. వాహనాలు, లాడ్జిలు, క్షుణ్ణంగా పరిశీలించారు. రాత్రి వేళల్లో లాడ్జిల్లో బస చేసిన వారి వివరాలపై ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగ్ ఘటనలో 80, డ్రంక్ అండ్ డ్రైవ్ లో 96, రోడ్డు నిబంధనలు పాటించని మరో 514 మంది పై కేసులు నమోదు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

## కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా గణిత దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, కంభం, డిశంబర్ 22)
స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రంలో ఉర్దూ డి.ఐ మొయినుద్దీన్ పాల్గొని గణితం ప్రాముఖ్యతను, నిత్య జీవితంలో గణిత శాస్త్ర ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పరిశోధనకు ఉపయుక్తమైన గణిత బోధనోపకరణాలను రూపొందించిన విద్యార్థులు నమూనాలను ప్రదర్శించి సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్య రామారావు, హబిబుర్ రహమాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## దగ్గుపాటి పురంధేశ్వరికి స్వాగతం పలికిన బీజేపీ నేతలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)
కాకతీయ సేవ సమైక్య భవన భూమి పూజ కార్యక్రమానికి ఒంగోలుకు విచ్చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు , రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరికి ఘనముగా స్వాగతం పలికారు. బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వై.సి యోగయ్య యాదవ్‌తో పాటు బిజెపి శ్రేణులు, అభిమానులు స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సామాజిక సేవలో ముందుండాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించి తలపెట్టిన బాలికల వసతి గృహ భవన సముదాయానికి భూమి పూజలో పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ఎంపీ పురందేశ్వరి













ఫొటో నెం. 29, 30, 31, 32, 33, 34

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)
కులంలో ఉన్న సంఘాలు సామాజిక సేవా కార్యక్రమాలు చేసే దిశగా ముందుకు నడవాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఒంగోలు కొత్త మామిడిపాలెం లో కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన బాలికల వసతి గృహానికి భూమి పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా జరిగిన సభకు కాకతీయ సేవా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటరావు అధ్యక్షత వహించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్న సంకల్పాన్ని తీసుకొని బాలికల వసతిగృహం నిర్మించాలని కోవటం గొప్ప సేవా కార్యక్రమం అని ఆమె అన్నారు. తమ తండ్రి దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. మహిళలు చదువులో ఎదగాలనేదే నందమూరి తారక రామారావు ఆకాంక్షని, అలాగే తమను కూడా పెంచారని పేర్కొన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అన్న నందమూరి తారక రామారావు సూక్తులను అందరం పాటించాలని అటువంటి మహనీయుని అడుగుజాడలలో అందరం నడవాలని ఆమె పిలుపునిచ్చారు. సమాజానికి సేవ భగవంతుని సేవతో సమానమని తెలిపారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ ఏదైనా కలిసి ఉంటేనే కలదు సుఖమని, అందరూ కలిసి ఉంటేనే సమాజానికి సేవ చేయవచ్చు అని అన్నారు. కమ్మ సంఘాల లోనే రెండు గ్రూపులు ఉండడం మంచిది కాదని, అందరం కలిసి కూర్చొని మాట్లాడుకొని ఐకమత్యంతో ముందుకు సాగాలని తెలిపారు. కాకతీయ సేవా సమాఖ్య ద్వారా ఒక్క కమ్మ కులానికే కాకుండా ఇతర కులాల్లోని పేదలకు సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థల దాత భగీరథ కెమికల్ ఇండస్ట్రీ లిమిటెడ్ వ్యవస్థాపక అధ్యక్షులు సింగవరపు కోటేశ్వర రావు రత్న కుమారి, సింగవరపు కోటేశ్వర రావు చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చంద్ర శేఖర్, లలిత దంపతుల కు అభినందనలు తెలిపారు. వెంకట రామయ్యకి సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఈదర హరిబాబు, దివి శివరాం, గోపాలకృష్ణ, ఈదర మోహన్, హర్షిని విద్యాసంస్థలు గోరంట్ల రవికుమార్, శ్రీపతి విద్యాసంస్థల నల్లూరి వెంకటేశ్వర్లు, బిజెపి జిల్లా అధ్యక్షులు పీవీ. శివారెడ్డి, కామేపల్లి శ్రీనివాసరావు, బొద్దులూరి ఆంజనేయులు,వాసు చౌదరి, కార్పొరేటర్ మస్తానమ్మ, డాక్టర్ కమలా శు

## ఇండిగో పెయింట్స్ సహకారంతో ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముస్తాబు









(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 22)
మండల కేంద్రమైన ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల బిల్డింగ్‌కు ఇండిగో పెయింట్స్ వారి సహకారంతో చక్కగా రంగులు వేయడం జరిగిందని కంపెనీ మేనేజర్ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. ఇండిగో పెయింట్స్ వారు ఉచితంగా స్థానిక పెయింటర్స్ సహకారంతో ఈ బిల్డింగ్‌కి పెయింట్స్ వేయడం జరిగింది. అందుకుగాను ఆదివారం పెయింటర్స్‌కి బహుమతులు, ఇండిగో పెయింట్ తరఫున జీవిత బీమా సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు ఇతర ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పూర్తి సహకారాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా భీమవరం ,ఉలవపాడు ,కరేడు ,సింగరాయకొండ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది పైగా పెయింటర్స్ భవనానికి పెయింట్స్ వేయటంలో సహకరించారు. విద్యార్థినీ, విద్యార్థుల సౌకర్యం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇండిగో పెయింట్స్‌కు చెందిన కంపెనీ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, సేల్స్ ఎగ్జిక్యూటివ్ మోహిత్, స్థానిక ఇండిగో డీలర్ మనోజ్ కుమార్ లు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ బృహత్కర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం జరిగిన సభలో పెయింటర్స్, విలేకరులు, ఇండిగో కంపెనీ ప్రతినిధులు పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.

# పద్మశాలియ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

### అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రవీంద్ర, ఆదినారాయణ

### కోశాధికారిగా గోపిశెట్టి గోపినాధుడు







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, డిశంబర్ 22)
మార్కాపురం పట్టణంలోని శ్రీ మార్కండేశ్వర పద్మశాలీయ బహోత్తమ సేవా సంఘం సర్వసభ్య సమావేశం సంఘ గౌరవ అధ్యక్షులు కందగట్ల కేశవ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్టీసీ డిపో మేనేజర్ అవ్వారి శ్రీధర నరసింహులు, ఉపాధ్యాయులు ఉక్కడపు సుధాకర్ లు అతిథులుగా హాజరై మాట్లాడుతూ కమిటీ సభ్యులందరి సహకారంతో కలిసికట్టుగా పనిచేస్తే సంఘ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రిటైర్డ్ ఎమ్మార్వో అడిగొప్పుల వేణుగోపాల్ ,పెద్దారవీడు ఎంఈఓ ప్రగడ శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీ మార్కండేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం కృషి చేయాలని అన్నారు. అనంతరం సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్షులుగా గంజి రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా కందగట్ల ఆదినారాయణ, కోశాధికారిగా గోపిశెట్టి గోపి నాథుడు లతోపాటు ఉపాధ్యక్షులుగా నారాయనం శ్రీరామచంద్రమూర్తి, అవ్వారి విజయ సారథి, తనికంటి ఈశ్వరయ్య లు సహాయ కార్యదర్శులుగా ఈపూరి సుబ్బయ్య, అనుముల కిషోర్ లు ఉప కోశాధికారులుగా ప్రగడ పవన్, తనీకంటి నాగేంద్ర, దిగదారి నాగేంద్ర లతోపాటు మరో 18 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఎన్నిక అనంతరం నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ కమిటీ సభ్యులందరితో కలిసి పద్మశాలియ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని సేవా కార్యక్రమాలు పెద్దల సలహా మేరకు ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల బాంధవులు అందరూ పాల్గొని విజయవంతం చేశారు.

# జిల్లా పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ ఏ ఆర్ దామోదర్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 22)

జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ హాజరై సెమి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేసి, క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కమ్యూనిటీ చర్చి నందు సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఏసుక్రీస్తు పుట్టిన రోజైన క్రిస్మస్ శాంతి, సంతోషాలకు ప్రేమ, త్యాగనిరతికి చిహ్నమని, సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, సహనం, అవధుల్లేని త్యాగం, శాంతియుత జీవనం వంటివి మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని, క్రీస్తు బోధనలు ఎప్పటికీ మనుషులందరినీ మంచి మార్గంలో నడిపిస్తాయన్నారు. పండుగను అందరితో సోదర భావంతో కలిసి మెలిసి సంతోషంగా చేసుకోవాలన్నారు. అనంతరం పెయింట్, డ్రాయింగ్ గ్రీటింగ్ కార్డులు, నాటక ప్రదర్శిన చేసిన చిన్నారులకు ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించి, బహుమతులను అందచేశారు.

ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సిఐ అజయ్ కుమార్, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఆర్ ఎస్ఐలు, పాస్టర్ యం ప్రసాద్, పోలీస్ కమిటీ, చర్చి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





# క్రీస్తు మార్గం అనుసరణీయం

## నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ కరిముల్లా




(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిశంబర్ 22)

మండలంలోని మణికేశ్వరం గ్రామంలో పాస్టర్ మందా మాథ్యూస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా పలువురు గ్రామ తెదేపా నేతలు హాజరయ్యారు ఈసందర్భంగా కరిముల్లా మాట్లాడుతూ ప్రేమ, దయ, శాంతికి యేసు క్రీస్తు మార్గదర్శి అని, అందరూ ఆ ప్రభువైన యేసు చూపిన మార్గంలో నడిచి తనను వలే తన ఎదుటివారిని ప్రేమించాలని తెలియ చేశారు. రాష్ట్రంలో శాంతికి సుపరిపాలనకు సర్వమత స్వేచ్ఛకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్ని మతాలను గౌరవించే గొప్ప నాయకులని కొనియాడారు. క్రిస్టియన్ల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గ్రామ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ ను కట్ చేశారు. కార్యక్రమంలో దాసరి మోషే, దావీదు, బుల్లియ్య, రూబేను, సంఘు కాపరులు, స్థానిక తెదేపా నేతలు, తదితరులు పాల్గొన్నారు.



# 10వ తరగతి మోడల్ పరీక్ష విజయవంతం




(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిశంబర్ 22)

యుటీఎఫ్ వారి సహకారంతో ఎస్ఎఫ్ఐ వారు ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షను నిర్వహించారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ మోడల్ పరీక్ష చీమకుర్తి మండలంలో శ్రీ గౌతమీ డిగ్రీ కాలేజీ , దేవరపాలెం గవర్నమెంట్ హై స్కూల్ రెండు కేంద్రాలుగా 400 కు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ నాయకులు విద్యార్థులకు పబ్లిక్ ఎగ్జామ్స్ గురించి అవగాహన కల్పించారు. పబ్లిక్ ఎగ్జామ్స్‌కు ఎలా ప్రిపేర్ అయితే ఉత్తీర్ణత సాధించడమే కాకుండా మంచి మార్కులు కూడా సాధించే విధంగా సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేవరాజు మాట్లాడుతూ ఈ మోడల్ పరీక్ష ఇన్విజిలేషన్, పేపర్ వాల్యుయేషన్ కు సహకిరించిన యుటిఎఫ్ నాయకులకు,ఎగ్జామ్ కి హాజరైన విద్యార్థులకు, స్కూల్స్ యాజమాన్యంకి, పరీక్ష కేంద్రానికి పర్మిషన్ ఇచ్చిన కాలేజీ యాజమాన్యంకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో యుటీఎఫ్, ఎస్ఎఫ్ఐ కలిసి ఇలాంటి చాలా కార్యక్రమాలు చేపడతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ మండల అధ్యక్షుడు షేక్ అక్బర్, ప్రధాన కార్యదర్శి చలవాది శ్రీను, అమరా మురళి, ఎన్‌పి వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి దేవరాజు, మండల నాయకులు జె ప్రవీణ్, ఈ శ్రీకాంత్, ప్రసాద్, మణికంఠ, ప్రేమ్, రవితేజ, కోటేశ్వరావు పాల్గొన్నారు.

# మెడికల్ సీట్లను సాధించడంలో నారాయణ విద్యాసంస్థలకు ఎవ్వరూ మరొకరు సాటి లేదు

### నారాయణ విద్యాసంస్థల అధ్యాపకులు




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)

ఎడ్యుకేషన్ రంగంలో నారాయణ విద్యాసంస్థలకు ఒక బ్రాండ్‌ను క్రియేట్ చేశామని, ఎప్పటికీ ఆ బ్రాండ్ హై రేంజ్ లోనే ఉంటుందని విద్యాసంస్థల అధ్యాపకులు అన్నారు. నాలుగు దశాబ్దాలుగా పోటీ పరీక్షల్లో తమ స్థానం పదిలంగానే ఉంటుందని మెరుగైన ర్యాంకులు సాధిస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. నీట్2024లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్దులను నారాయణ మెడికల్ కాలేజ్ అడిటోరియం హాల్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. దేశంలోని ప్రతిష్టాత్మకంగా మెడికిల్ కాలేజీల్లో సీట్లు పొందిన వారందరూ నారాయణ కాలేజీలో చదివిన వారే ఉంటడం మన గర్వకారణమన్నారు. 2024 నీట్లో దాదాపు 350 మంది విద్యార్దులకు మెడికల్ సీట్లు వచ్చాయన్నారు.ఉత్తమ బోధనఅంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మెటీరియల్ నిరంతర పర్యవేక్షణతోనే ఇదంతా సాధ్యమైందన్నారుఅసాధారణ ఫలితాలను ఇంకెవ్వరూ సాధించలేని విజయాలను ఒక్క నారాయణ మెడికల్ కాలేజీ సాధిస్తుందని చెప్పడానికి గర్వంగా ఉందని ఆయన వెల్లడించారు. అనంతరం విద్యార్దినీలు నిర్వహించిన డ్యాన్సులు అందరికీ ఆకట్టుకున్నాయి. మాస్ డ్యాన్స్‌లు, అదరగొట్టే స్టెప్ లతో విద్యార్థులు హోరెత్తించారు.













# వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)

8 నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తన భార్యకు...ఆరోగ్యం నయం కావడంతో దానికి సహాయపడిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చిత్రపటానికి ధన్యవాదాలు తెలుపుతూ బిసిసిఐ జిల్లా అధ్యక్షులు నిమ్మల నాగార్జున యాదవ్ పాలాభిషేకం చేశారు. 8 నెలల నుండి తన భార్య యొక్క ఆరోగ్యం గురించి ఎంతో బాధపడుతూ ప్రతి ఒక్క హాస్పిటల్ చుట్టూ తిరిగిన ఏ హాస్పిటల్ లోనూ తన భార్య యొక్క శరీరం యొక్క కండిషన్ కి తనకి గర్భసంచిలో క్యాన్సర్ ఉందని ట్రీట్మెంట్ ఎక్కడ కూడా జరగడం చాలా కష్టమైనది అని ఎవరు కూడా టేకప్ చేయలేదు అలాంటిది ప్రశాంతి మేడం దగ్గరకు వెళ్లగానే నా బాధను మేడంకి చెప్పిన తర్వాత మేడమ్ వెంటనే స్పందించి ఎంతో గొప్ప మనసుతో కిమ్స్ డాక్టర్స్ తో మాట్లాడి మా భార్యకు ఆపరేషన్ చేయడం జరిగింది. ఇంత మేలు చేసిన మన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి , వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మన నెల్లూరు జిల్లాకు ఎమ్మెల్యే, ఎంపీగా ఉండడం అనేది నెల్లూరు జిల్లా చేసుకున్నటువంటి గొప్ప అదృష్టమని తెలిపారు. అందుకు కృతజ్ఞతగా తాను ఈ రోజు తన కుటుంబ సభ్యులతో వారికి పాలాభిషేకం చేయడం జరిగింది. వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)

కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కావలి ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ చవల రామకృష్ణ ,లక్ష్మీ వల్లి దంపతుల మనవడు నామకరణ, బారసాల వేడుక కార్యక్రమం కావలి పట్టణం శివాలయం వీధిలోని ది హోల్ సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణమండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం కావలి పట్టణానికి చెందిన పచ్చిపులుసు వెంకటేష్ , పార్వతీ దంపతుల కుమార్తె నిధి పుష్పాలంకరణ కార్యక్రమం కావలి పట్టణంలోని బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

# బీద మస్తాన్‌రావును కలిసిన ప్రముఖులు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 22)

తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యులుగా డా.బీద మస్తాన్ రావు , బిజెపి రాజ్యసభ సభ్యులుగా ఆర్. కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిబీద రవిచంద్ర ఆదివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు.ఇరువురిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో భూమి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు, కన్నబాబు, గిలక నరేంద్ర, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

# క్రిస్మస్ సందర్భంగా వితంతు మహిళలకు దుస్తుల పంపిణీ

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 22)

హనుమంతునిపాడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలసాని కోటేశ్వరరావు ఆదివారం ఉదయం 10 గంటలకు బడుగులేరు గ్రామం తెలుగు “కేర్ ఇండియా “చర్చి” నందు 20 మంది వితంతు మహిళలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని బాలసాని కోటేశ్వరావు ఆయన కుమారుడైన రవికుమార్ ఆర్థిక సాయంతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి “జాన్ పీటర్” సంఘస్తులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com